క్లుప్తంగా

బస్ షెల్టర్‌ను బాగుచేయరూ..



మరమ్మతులకు నోచుకోని తిక్కవానిపాలెం బస్ షెల్టర్

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం గ్రామ మత్స్యకారుల సౌకర్యార్థం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ మరమ్మతులకు గురై కూలి పోయే స్థితికి చేరుకుంది. షెల్టర్ నిర్మించాక ఒక పర్యాయం రిపేర్లు చేసినా.. ఉప్పుగాలికి మళ్లీ అధ్వానంగా మారింది. గచ్చులు పాడయ్యాయి. చిన్నపాటి వర్షం వచ్చినా శ్లాబ్ కారిపోతుంది. దీని నీడన బస్సులు, ఆటోల కోసం వేచి ఉండాలంటే ప్రయాణికులు భయపడే పరిస్థితి. ప్రస్తుతం స్వల్ప మరమ్మతులు చేపడితే మరికొంత కాలం ప్రయాణికులకు నీడనిస్తుంది. ప్రయాణికులు ఇబ్బందుల్ని గుర్తించి బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన తొమ్మిది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.90 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. గురువారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అంబులెన్స్ కొనుగోలుకు విరాళం



అంబులెన్స్ కొనుగోలుకు విరాళం అందిస్తున్న యూనిక్ అధినేత నాని

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ త్వరలో కొనుగోలు చేయనున్న అంబులెన్స్ కోసం తమవంతుగా పెందుర్తిలోని యూనిక్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల సహకారం అందించింది. పాఠశాల అధినేత కోనేటి ఆదినారాయణ(నానీ సర్) రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆ నగదును ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దాతల సహకారంతో త్వరలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆపదలో ఉన్నవారిని ఈ అంబులెన్స్ ద్వారా ఉచితంగా దగ్గర్లోని ఆస్పత్రులకు తరలిస్తామన్నారు.

పబ్లిక్ పార్కుకు ఫీజు వసూలు

సీనియర్ సిటిజన్ల అసంతృప్తి

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సీతారామరాజు నగర్‌లో జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కుకు వచ్చిన సందర్శకుల నుంచి ఫీజు వసూలు చేస్తుండటంపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పరిసర కాలనీలకు చెందిన సీనియర్ సిటిజన్లు ఈ పార్కును సందర్శించగా.. డబ్బులు చెల్లిస్తేనే ప్రవేశం ఉంటుందని అక్కడి సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీనిపై సీనియర్ సిటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పబ్లిక్ పార్కుకు ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. డబ్బులు వసూలు చేసేందుకు జీవీఎంసీ నుంచి అనుమతులేమైనా ఉన్నాయా..? అని నిలదీశారు. రూ.100 కట్టి కార్డు తీసుకుంటేనే పార్కులోకి పంపిస్తామని, లేకుంటే కుదరని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పలువురు సీనియర్ సిటిజన్లు వెనుదిరిగి పోయారు. దీనిపై ఇటీవల కొంతమంది ఎమ్మెల్యే గణబాబుకు కూడా ఫిర్యాదు చేశారు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కు సందర్శకుల నుంచి డబ్బులు వసూలు చేస్తూనే ఉన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, పార్కులో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చినా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం



పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ముగ్గురు ఉక్కు అధికారులను వారి ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజా సంఘాలు గురువారం ఘనంగా సత్కరించాయి. అగనంపూడిలోని సీడబ్ల్యూసీలో అగనంపూడి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, పిల్లా వరహా వెంకట లక్ష్మి సేవా ట్రస్ట్‌ల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు అధికారులు ఎం. ఉమామహేశ్వరరావు, జామి గణేష్, పి.వెంకటరావులను ఘనంగా సత్కరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు.. టెన్త్ కనీస విద్యార్హతతో విధుల్లో చేరినవారే ఎక్కువ. గ్రామీణ ప్రాంత కార్యకర్తల్లో అత్యధికులకు స్మార్ట్ ఫోన్ టెక్నాలజీ కొరుకుపడనిది. అలాంటి వీరితో ఒకే పనిని పలుమార్లు యాప్‌లలో నమోదు చేయాలన్న ఆదేశాలతో వారి ప్రధాన విధి అయిన ప్రీస్కూల్ బోధన పక్కదారి పడుతోంది. యాప్‌ల వినియోగంపై అవగాహనలేక ఆందోళనకు గురవుతున్నారు. సబ్బవరం మండలంలోనైతే చాలా గ్రామాల్లో మొబైల్ నెట్‌వర్క్ సరిగాలేని పరిస్థితి. దీంతో వీరి బాధలు వర్ణనాతీతం.

అంగన్‌వాడీలు.. యాప్‌సోపాలు!



ప్రీస్కూల్ తరగతి నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ

చేసే పనుల కంటే.. యాప్‌లో నమోదులే అధికం

తక్కువ ర్యామ్ ఫోన్లు.. అందని నెట్‌వర్క్

సతమతమవుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మండలంలో వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	87
అంగన్‌వాడీ సిబ్బంది	159 మంది
లబ్ధిదారులు	
గర్భిణులు	357
బాలింతలు	258
6–36 నెలల పిల్లలు	1,846
3–5 ఏళ్ల పిల్లలు	822

సబ్బవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం సరఫరాలో ప్రత్యేక యాప్‌లలో పలుమార్లు వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో ముఖ గుర్తింపు వ్యవస్థ(ఎఫ్ఆర్ఎస్)/బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో నెట్‌వర్క్ సరిగా పని చేయకపోయినా, లబ్ధిదారుల మొబైళ్లకు మెసేజ్ బ్యాలెన్స్‌లేక ఓటీపీ రాకపోయినా సరకులు అందించలేని పరిస్థితి. దీంతో తమతోపాటు లబ్ధిదారులు కూడా తిప్పలు పడాల్సి వస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు.



ముఖ గుర్తింపును యాప్‌లో నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

టీహెచ్ఆర్‌తో తిప్పలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 6 నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులకు ప్రతినెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల వద్దే ఇచ్చేవారు. దీన్ని గతంలోనే టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)గా మార్చి పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతినెలా రెండుసార్లు అందిస్తోంది. ఈ రెండుసార్లు పోషణ్ ట్రాకర్ యాప్‌లో వివరాల నమోదుకే ఎక్కువ సమయం పడుతోంది. ఎఫ్ఆర్ఎస్‌తోపాటు, బయోమెట్రిక్ తప్పనిసరి. బయోమెట్రిక్‌కు ఆధార్‌తో అనుసంధానించిన మొబైల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయాలి. చాలాసార్లు ఈ నమోదుకే ఒక్కో లబ్ధిదారుకు అరగంటకుపైనే పడుతోందని, దీంతో పిల్లలకు ప్రాథమిక విద్య బోధన ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యాప్‌ల భారం తగ్గించాలని ఐసీడీఎస్ ఆఫీస్ ఎదుట నిరసనలో అంగన్‌వాడీ సిబ్బంది

పని పెరిగి.. బోధన తగ్గి

ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 వరకూ రికార్డులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం(ఎఫ్‌సీఆర్), పిల్లలు, బాలింతలు, గర్భిణుల నమోదు, ప్రీస్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతి రోజూ విధిగా నమోదు చేయాలి. మరోవైపు పిల్లల టీకాల రికార్డులు, విటమిన్-ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శకుల రికార్డులు, నెలవారీ ప్రాజెక్టులు, హౌస్‌హోల్డ్ సర్వే రికార్డు, గ్రోత్ చార్ట్ తదితరాలతోపాటు ఇప్పుడు యాప్‌లు అదనం. ఈ యాప్‌లలో నమోదు ప్రక్రియ మరింత ఇబ్బందిగా మారింది. మండలంలో చాలా వరకు గ్రామీణ ప్రాంతమే కావడంతో మొబైల్ నెట్‌వర్క్ సమస్య అధికంగా ఉంది. ప్రభుత్వం అందించిన తక్కువ ర్యామ్ ఫోన్లలో యాప్‌ల పనితీరు దారుణంగా ఉంది. తరచూ యాప్‌లు మొరాయించడం సర్వసాధారణంగా మారింది. దీంతో పిల్లలకు ప్రీస్కూల్ బోధన దాదాపుగా అటకెక్కుతోంది.

నెట్‌వర్క్ ఇబ్బందులు



మా అంగన్‌వాడీ పరిధిలో గర్భిణులు, బాలింతలతో పాటు 0.6–3 ఏళ్ల వయసున్న చిన్నారులు మొత్తం 25 మంది ఉన్నారు. నెలకు రెండు సార్లు ఎఫ్ఆర్ఎస్ చేయాలి. బాల సంజీవిని, పోషణ ట్రాకర్ యాప్‌లు ఉన్నాయి. మావూర్లో నెట్‌వర్క్ సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం.

– పిల్లల కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, రాయపుర అగ్రహారం

ఒత్తిడికి గురవుతున్నాం



పదో తరగతి అర్హతగా అప్పట్లో అంగన్‌వాడీ కార్యకర్తలను తీసుకున్నారు. ప్రస్తుత యాప్‌లు ఉన్నత విద్యావంతులకూ ఓ పట్టాన కొరుకుడుపడవు. ఈ యాప్‌లపై అవగాహనలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. వీటితోపాటు రికార్డుల నిర్వహణ తలకు మించిన భారమవుతోంది.

– ఎం.వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, పైడివాడ అగ్రహారం

యాప్ మార్పులకు అవకాశం



యాప్‌లు ఎక్కువగా వినియోగించాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు మా దృష్టికి తీసుకొచ్చారు. వారి ఇబ్బందుల్ని పీడీ, కమిషనర్‌కు నివేదించాం. త్వరలోనే అంగన్‌వాడీ కార్యకర్తల పనిభారం తగ్గించేలా యాప్‌లలో మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉంది.

– లలిత కుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, సబ్బవరం ప్రాజెక్టు

లండ వెంకటరమణకు ఘన నివాళి



లండ వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, డైరెక్టర్లు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ నేత, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పూజారి, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ లండ వెంకటరమణ మరణం బాధాకరమని కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అన్నారు. సొసైటీ భవనంలో గురువారం వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి సొసైటీ పాలకవర్గం, ఉద్యోగులు నివాళులర్పించారు. 2022లో తొలిసారి సొసైటీ పాలకవర్గ సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచి లండ సొసైటీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు కొలుసు గురునాథరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, గొంతిన రామకృష్ణ, ఆకుల నాగరాజు, పాలూరు సూరిబాబు, మజ్జి ధర్మరాజు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సుదర్శన యాగం నిర్వహించారు. సుదర్శనుల వారి తిరునక్షత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ యాగం జరిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, దొడ్డి రమణ, భువనేశ్వరి శర్మ, భవాని ప్రసాద్, ఉషారాణి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహాలక్ష్మి

పరవాడ: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ మహిళా ఎస్‌ఐ మహాలక్ష్మి సూచించారు. తానాం గురుకుల పాఠశాలలో సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్, మహిళా భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం చట్ట వ్యతిరేకమన్నారు. మొబైల్ ఫోన్లలో సైబర్ నేరగాళ్లు పెడుతున్న మోసపూరితమైన మెసెజ్‌లకు స్పందించకూడదని హెచ్చరించారు. మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించడం నేరమని, నిబంధనలకు లోబడి వాహనాలను నడపడం, రోడ్లపై రాకపోకలు సాగించే క్రమంలో ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలి



రాయపుర అగ్రహారంలోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సర్వే ఏడీ గోవిందరావు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను సర్వే సబ్ డివిజనల్ అడిషనల్ డైరెక్టర్(అమరావతి) ఆర్.గోవిందరావు(ఐఏఎస్) గురువారం పరిశీలించి, గ్రామ సభలో పాల్గొన్నారు. రైతుల సమక్షంలో రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని రాయపుర అగ్రహారంలో గతంలో ఏర్పాటుచేసిన గృహ నిర్మాణ లేఅవుట్‌ను పరిశీలించారు. గృహ నిర్మాణాలు చేపట్టక పోవడంపై లబ్ధిదారులను ఆరా తీశారు. జీవో నెం.30లో భాగంగా మండలంలో గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణపై విచారణ చేపట్టారు. 2019కి ముందు ప్రభుత్వ భూముల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. మండలంలో ఏయే గ్రామాల్లో ఎన్ని గృహాలు ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో షేక్ ఆయేషా, ఏడీ సర్వేయర్ గోపాలకృష్ణ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ ఉపాధ్యాయినికి సత్కారం



పుణ్యవతి దంపతులను సత్కరిస్తున్న టీచర్లు

పరవాడ: విద్యార్థుల మనసుల్లో స్థానం దక్కించుకునే ఉపాధ్యాయులు ధన్యులని పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని పుణ్యవతి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుణ్యవతి అందించిన సేవల్ని కొనియాడారు. పాఠశాల హెచ్ఎం నోట్ల శ్రీనివాసరావు, పూర్వ హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు, ఉపాధ్యాయులతో కలిసి పుణ్యవతి దంపతులను ఘనంగా సత్కరించారు. ఏపీ వీవీపీ రిటైర్డ్ కమిషనర్ సావిత్రి, కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసి, రాంబిల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఖగేశ్వరరావు, జింక్ హైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం సత్యనారాయణ, సదాశివరావు, లక్ష్మీబాయి, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, మాసవరపు అప్పారావు, ఉపాధ్యాయులు రమేష్ బాబు, కూర్మారావు, సంజీవరావు, విక్టోరియా, కామేశ్వరి, అరుణ, జ్యోతి, అప్పలనాయుడు, అప్పలరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, సన్యాసినాయుడు, అన్నాజీరావు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్, కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్టీలు

సబ్బవరం: చదువుకు, సిలబస్‌కు తేడా ఉందని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో కేజీబీవీ తెలుగు సీఆర్టీలకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పలు అంశాలను వివరించారు. చేసే ప్రతి పని పట్ల అంకిత భావం కలిగి, ఆనందంగా, మనస్ఫూర్తిగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు, జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్, స్టేట్ అబ్జర్వర్ శేషగిరిరావు, జీసీడీవో ఏఎస్‌డీ జమున తదిరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఒలింపిక్స్‌లో విద్యార్థి సత్తా



విజేతను అభినందిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: విభిన్న ప్రతిభావంతుల ఒలింపిక్స్‌లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.రాజేష్ సత్తా చాటాడు. బిలాస్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన బోషి అనే ఈ పోటీలలో వ్యక్తిగత విభాగంలో ఐదో స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ విద్యార్థికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు.

సింహాద్రి థర్మల్ ప్లాంట్‌ను సందర్శించిన డీఆర్ఎం



సింహాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్యటిస్తున్న వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా, అధికారులు

పరవాడ/తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్టీపీసీ)ను సందర్శించారు. ఈ ప్రాంతంలోని రైల్వే సైడింగ్, ఇతర కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. రైల్వే సైడింగ్‌లో ర్యాక్‌ల నిర్వహణ, ర్యాక్‌ల రాకపోకల విషయంలో భద్రతా ప్రమాణాలపై అధికారులతో చర్చించారు. ఎన్టీపీసీ ప్రాంగణంలో రైళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్టీపీసీ సమీపంలోని జగ్గయ్యపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రతా విధానాలను డీఆర్ఎం పరిశీలించారు.

● నుయ్యి కాదు.. గొయ్యే..!



మండలంలోని జాజులవానిపాలెం-కలపాక రహదారిలో మరిశవానిపాలెం చెరువు వద్ద ఏర్పడిన గుంత ప్రయాణికులను భయపెడుతోంది. గుంత ఏర్పడి చాలా కాలమవుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు, పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీంతో గుంత రోజురోజుకూ పెరిగి దిగుడు బావిని తలపిస్తోంది. ఎన్టీపీసీ, హిందూజా, సాల్ట్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీనితోడు ఈ రహదారిలో వీధి దీపాలు లేక రాత్రి వేళ రాకపోకలు సాగించే ప్రయాణికులు గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి గుంతను పూడ్చి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పరవాడ

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులతో మాట్లాడుతున్న పెందుర్తి సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: యుక్త వయసులో మద్యం, మాదకద్రవ్యాల వల్ల జీవితాలు నాశనం అవుతాయని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. చినముషిడివాడ డేటాప్రో కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో గురువారం 'విద్యార్థి భద్రత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టీనేజీలో మంచి-చెడులపై తగిన అవగాహన పెంచుకోవాలన్నారు. మద్యం, డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు బానిసలైతే కుటుంబాలకు కూడా తలవంపులు వస్తాయన్నారు. బాలికలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుని ప్రతి విద్యార్థి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డేటాప్రో సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.